

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి -పోరుమామిళ్ల

మండలంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని రంగ సముద్రం పంచాయతీ సర్పంచ్ రవి ప్రకాశ్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని సిద్ధవరంలో వైసిపి నాయకులు గుత్తిరెడ్డి చిన్న రమణారెడ్డి ద్వితీయ వర్ధంతి సందర్భంగా మదర్ థెరిసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్రయాన్స్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ మౌనిక రెడ్డి, డాక్టర్ సత్య గౌడ్ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రవిప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ రమణారెడ్డి ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం కుటుంబ సభ్యుల సహకారంతో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఇందు కయ్యే ఖర్చును ఎంపిటిసి లక్ష్మీదేవి, రామ్మోహన్‌రెడ్డి భరించడం అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి ముత్యాల ప్రసాద్ చిత్తా ప్రజలు రెడ్డి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక పురోభివృద్ధికి కృషి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

ప్రజాశక్తి- కడప అర్బన్

జిల్లాలో పారిశ్రామిక రంగం ఆర్థిక పురోభివృద్ధికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషిచేయాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు పేర్కొన్నారు. గురువారం జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమలే జిల్లా ఆర్థిక ప్రగతికి ఆయువు పట్టు అని పేర్కొన్నారు. ఆ దిశగా జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి పథంలోకి తీసుకురావాలని సూచించారు. రాష్ట్రంలో పారిశ్రామిక రంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం అందించాలని చెప్పారు. ముఖ్యంగా ఎస్‌సి, ఎస్టిఇ ఔత్సాహిక నూతన పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా పరిశ్రమల శాఖ, బ్యాంకు అధికారులు దృష్టి సారించాలన్నారు. జిల్లాలో అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించి పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. పరిశ్రమల స్థాపన వల్ల వేలాది మంది నిరుద్యోగ యువతకు ఉపాధి లభించడంతో పాటు జిల్లా ఆర్థిక ప్రగతి కూడా మెరుగుపడుతుందన్నారు. పారిశ్రామిక అభివృద్ధి పాలసీ 2015-20, 2020-23 అనుసరించి జిల్లాలో అన్ని సెక్టార్లలోని మొత్తం 77 యూనిట్లకు గాను రూ. 8.02 కోట్ల రాయితీ మొత్తం విడుదలకు కమిటీ ఆమోదం తెలిపిందని చెప్పారు. ఎపిఐఐసికి సంబంధించి ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో కొత్త యూనిట్ల ఏర్పాటు కోసం వచ్చిన మూడు దరఖాస్తులను ఆమోదించామని పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జయలక్ష్మి తెలిపారు. ఆయా అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. సమావేశంలో జెసి సాయికాంత్‌వర్మ, కమిషనర్ జిఎస్ఎస్. ప్రవీణ్ చంద్, శిక్షణా కలెక్టర్ రాహుల్ మీనా, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ శ్రీనివాస మూర్తి, డిపిఒ ప్రభాకర్ రెడ్డి, లీడ్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పేదలకు భూ పంపిణీ చేయాలి

వ్య.కా.స రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-మైదుకూరు

పదేళ్ల నుంచి రాష్ట్రంలోని పేదలు ప్రభుత్వ భూములు నోచుకోలేదని భూ పంపిణీ చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం మైదుకూరు పట్టణం కడప రోడ్‌లోని షాదిఖాన్ హాల్‌లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా 6 వ మహాసభలు నిర్వహించారు. జిల్లా మహాసభకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ భూములు విస్తారంగా ఉన్నాయన్నారు. అర్హులకు అందకుండా అనర్హులైన రాజకీయ నాయకులు, స్థానిక ధనవంతులు వందల ఎకరాలను ఆక్రమించుకొని ఎస్టేట్స్‌గా మలుచుకున్నారన్నారు. అన్యక్రాంతులు ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవడంలో రెవెన్యూ యంత్రాంగం ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అసైన్మెంట్ కమిటీ ఏర్పాటు చేసి స్థానిక పేదలకు భూ పంపిణీ చేపట్టాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని 25శాతం నిధులు బడ్జెట్‌లోతగ్గించి గ్రామీణ పేదలకు పొట్ట కొట్టిందన్నారు. వలసల నివారణకు రూ. 2 లక్షల కోట్ల నిధులు బడ్జెట్‌లో కేటాయించాలని చెప్పారు. రూ. 200 రోజులు పనులు కల్పించాలని, ప్రతి శనివారం చేసిన పనులకు డబ్బులు చెల్లించాలని పేర్కొన్నారు. మస్టర్ విధానం, సమ్మర్, ఇతర అలవెన్సు ఇవ్వాలని చెప్పారు. గ్రామంలో పెద్ద ఎత్తున ఉపాధి భూ సమస్యలపై ఆందోళనలు చేపడతామని పిలుపునిచ్చారు. మహాసభలో ముందుగా వ్యవసాయ కార్మిక సంఘం జెండా ఆవిష్కరణను జిల్లా అధ్యక్షులు వెంకటేష్ ఆవిష్కరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్, సిఐటియు జిల్లా అధ్యక్షులు కె. శ్రీనివాసులు రెడ్డి, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు సుబ్బమ్మ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి, ఆవాజ్‌అధ్యక్షుడు చాంద్ బాషా, శారద ప్రసంగించారు. కార్యక్రమంలో అన్వేష్, ఉపాధ్యక్షులు జి శివకుమార్, చంద్రశేఖర్ నరసయ్య, వీరయ్య, గురవయ్య, పోలయ్య రాయప్ప, దేవ, సురేష్ బాబు, రవణమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

ట్రిపుల్‌ఐటిలో

విద్యార్థి ఆత్మహత్య




ఊరేసుకున్న శ్రీఈశ్వర సాయి

అమ్మానాన్న కలిసి ఉండాలని సూసైడ్ నోట్

శోక సంద్రంలో విద్యార్థులు, తల్లిదండ్రులు



కుమారుడి మృతదేహం వద్ద రోధిస్తున్న తల్లిదండ్రులు



చనిపోక ముందు రాసిన సూసైడ్ నోట్

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్‌జెయుకెటి యూనివర్సిటీ పరిధిలోని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటిలో పియుసి - 2 చదివే శ్రీఈశ్వర సాయి (17) అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకొన్న సంఘటన గురువారం చోటు చేసుకుంది. తన సూసైడ్ నోట్‌లో తల్లిదండ్రులిద్దరూ కలిసి ఉండాలని రాసి ఉంది. వివరాలు.. అనంతపురం జిల్లా ఉరవకొండ పట్టణానికి చెందిన నాగభూషణం, ఇరావతి దంపతులకు కుమారుడు శ్రీఈశ్వరసాయి. ఇడుపులపాయి ట్రిపుల్ ఐటిలో పియుసి-2 చదువుతున్నాడు. గురువారం క్లాస్‌కు వెళ్లకుండా హాస్టల్ గదిలోనే ఉండిపోయాడు. గదిలోని తోటి విద్యార్థులకు క్లాస్‌కు వెళ్లిన తరువాత ఎవరూ లేని సమయంలో తలుపులు మూసి ఫ్యాన్‌కు ఊరేసుకుని దుప్పటితో ఉరేసుకుని ఆత్మహత్య చేసు కున్నాడు. మధ్యాహ్నం భోజనం కోసం హాస్టల్ గదికి వచ్చిన విద్యార్థులు తలుపులు కొట్టినా తీయకపోవడంతో వారు ట్రిపుల్‌ఐటి అధికారులకు సమాచారం ఇచ్చారు. సెక్యూరిటీ సిబ్బందితో వచ్చిన అధికారులు కార్పెంటర్ సాయంతో తులుపులు తీశారు. విద్యార్థి ఫ్యాన్‌కు ఊరేసుకుని వేలా డుతూ కన్పించడంతో అధికారులు అవకయ్యారు. వెంటనే ఇడుపులపాయలోని ఆస్పతికి తరలి ంచారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధృవీ కరించారు. ఆత్మహత్య విషయాన్ని ఉరవకొండలోని తల్లిదండ్రులకు డైరెక్టర్ సంధ్యారాణి తెలి యజేశారు. మృతుని తండ్రి ప్రయివేట్ స్కూల్‌లో బస్సుల కో-ఆర్డినేటర్‌గా పనిచేస్తున్నట్లు విద్యార్థులు పేర్కొన్నారు. శ్రీఈశ్వర్‌సాయి చదువులో చురుగ్గా ఉండేవారని అధ్యా పకులు తెలిపారు. అధికారుల ద్వారా సమాచారం అందుకున్న సిఐ గోవిందరెడ్డి, ఎస్ఐ రంగా రావు ట్రిపుల్‌ఐటికి చేరుకుని గదిని పరిశీలించారు. అక్కడ విద్యార్థి రాసిన సూసైడ్ నోట్ దొరికింది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సిఐ పేర్కొన్నారు.



శ్రీఈశ్వరసాయి (ఫైల్‌ఫోటో)

విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం బాధాకరం

ఇడుపులపాయి ట్రిపుల్ ఐటీలో పియుసి - 2 విద్యార్థి శ్రీ ఈశ్వర్ సాయి ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరమని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ సంధ్యారాణి చెప్పారు. ట్రిపుల్ ఐటీలో ఇలాంటి సంఘటన జరగడం దురదృష్టకరమని అన్నారు. ఇంటి వద్ద ఉన్న సమస్యలతో ఆత్మహత్య చేసుకున్నాడని సూసైడ్ నోట్ ద్వారా తెలిసిందని చెప్పారు. విద్యార్థులు ఇలాంటి క్షణిక ఆవేశాలకు గురై ఆత్మహత్య చేసుకోవద్దని కోరారు.

మాకు ఎలాంటి కుటుంబ సమస్యలు లేవు..

చదువుపై ఒత్తిడితోనే చనిపోయాడు - విద్యార్థి తల్లిదండ్రుల ఆరోపణ

తమకు ఎలాంటి కుటుంబ సమస్యలు లేవని, ట్రిపుల్‌ఐటిలో టీచర్లు పెట్టే మానసిక ఒత్తిడి వల్లే చనిపోయాడని విద్యార్థి శ్రీఈశ్వర్‌సాయి తల్లిదండ్రులు నాగభూషణం, ఇరావతి ఆరోపిస్తున్నారు. తనకు గురువారం ఉదయం 10.15 గంటలకు ఫోన్ చేశాడని తండ్రి పేర్కొన్నారు. క్లాస్‌కు ఎందుకు వెళ్లలేదని అడగ్గా లీజర్ అని సమాధానం చెప్పాడని వాపోయారు. శెలవుల్లో ఇంటికొస్తే తమతో సంతోషంగా గడుపుతాడని పేర్కొన్నారు. చదువుపై ఒత్తిడితోనే చనిపోయి ఉంటాడని వారు తెలిపారు. రెండు రోజులుగా అతను మానసికంగా ఇబ్బంది పడుతున్నట్లు తోటి స్నేహితులకు చెప్పారని తెలిపారు. తనకు ఇద్దరు పిల్లలని కూమార్తె ఈశ్వరి డిగ్రీ రెండో సంవత్సరం ఉరవకొండలో చదువుతోందని చెప్పారు.

సూసైడ్ నోట్‌లోని వివరాలు..

ప్రియమైన అమ్మకు, నాన్నకు

నేను ఇలా ఆత్మహత్య చేసుకోవడం తప్పే, కానీ తప్పలేదు. దయచేసి అర్థం చేస్తుకోగలరూ..ఇప్పటికైనా ఇద్దరూ కలిసి ఉండి మాట్లాడుకోండి. ఇదే నా చివరి కోరిక అనుకోండి. నేను మీకు పుట్టడం నా అదృష్టం. కానీ మీకు అది దురదృష్టం. ఎవరు అర్థం చేసుకున్నా, లేకున్నా మీరు నన్ను అర్థం చేసుకుంటారని భావిస్తున్నాను. నేను భయపడి చావట్లేదు, ముందు జరిగే సంఘటనలను ఎదుర్కొన లేకపా తున్నా.. దయచేసి క్షమించండి. అన్న దగ్గరకు వెళ్లండి.. ఆయన మిమల్ని చూసు కుంటాడని అనుకుంటున్నా. మళ్లీ జన్మంటూ ఉంటే మీ కొడుకుగా పుట్టాలని ఆశిస్తున్నాను. వీళైతే ఎవర్నో ఒకరిని దత్తత తీసుకోండి.

- ప్రేమతో మీ చిన్న (సాయి)

క్లాప్ మిత్రలకు సకాలంలో గౌరవ వేతనం

కడప : క్లాప్ మిత్రలకు సకాలంలో గౌరవ వేతనాలను చెల్లించడంతో పాటు గ్రామాల్లో పారిశుధ్య సేవలను మరింత మెరుగు పరచాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం రాజధాని నుంచి గ్రామీణ ప్రాంతాల్లో అమలు చేస్తున్న గ్రామకంఠం (స్వమిత్వ), స్వచ్ఛ సంకల్పం, ఉపాధి హామీ పథకం, జలజీవన్ మిషన్ తదితర కార్యక్రమాల పని తీరుపై రాష్ట్ర పంచాయజీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖా కమిషనర్ కోన శశిధర్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం సంబంధిత అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమం ద్వారా గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య సేవలు మరింత మెరుగు పరిచేందుకు ప్రణాళికలు, లక్ష్యాలను నిర్దేశించుకుని అమలు చేయాలని పేర్కొన్నారు.

రోగుల పట్ల సహృదయంతో మెలగాలి

ప్రజాశక్తి-చెన్నూరు



మాట్లాడుతున్న ఎంపిపి చీర్ల సురేష్‌యాదవ్

వైద్యులు రోగుల పట్ల సహృదయంతో మెలగాలని పిహెచ్‌సి అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపిపి చీర్ల సురేష్‌యాదవ్ పేర్కొన్నారు. గురువారం ఉదయం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటుచేసిన అభివృద్ధి కమిటీ మొదటి సమావేశంలో ఆయన మాట్లాడారు. వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధా న్యత కల్పించారని తెలిపారు. మండల స్థాయిలో పిహెచ్‌సి ద్వారా మండల వాసులకు వైద్య సేవలు పటిష్ఠంగా అందిస్తున్నాని చెప్పారు. ఆస్పత్రికి సొంత భవనం లేకపోవడంతో సిహెచ్‌సి, పిహెచ్‌సి ఒకే చోట ఉండడంతో ప్రజలకు మెరుగైన వైద్యం అందించడం లేదని వాపోయారు. అయినప్పటికీ మండల వ్యాప్తంగా 9 సచివాలయాల పరిధిలో ప్రజలు అనారోగ్యానికి గురైతే వెంటనే అక్కడికి పిహెచ్‌సి వైద్య సిబ్బంది వెళ్లి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాని చెప్పారు. అనంతరం మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ జి.ఎన్. భాస్కర్‌రెడ్డి, ఆసు పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పెడబల్లె ప్రదీప్‌రెడ్డి మాట్లాడుతూ ఆస్పత్రిలో సిబ్బంది, పరికరాల కొరత లేదని తెలిపారు. ఆస్పత్రి అభివృద్ధికి సంబంధించి భవనంతో సహా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ సతీష్ డాక్టర్ చెన్నారెడ్డి, తహశీల్దార్ పఠాన్ అలీఖాన్, ఎంపిడిఒ జాన్ వెస్లీ, డాక్టర్ వంశీకృష్ణ, ఎంపిటిసిలు నిరంజన్ రెడ్డి, సాధిక్ అలీ, జూనియర్ అసిస్టెంట్ సతీష్, సూపర్వైజర్ సుబ్రహ్మణ్యం, నాయకులు డాక్టర్ పిచ్చయ్య, వైసిపి ఎస్‌టి సెల్ కన్వీనర్ శ్రీనివాసులు, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి బీమా చెక్కు అందజేత

కడప అర్బన్ : పులివెందుల పోలీస్‌స్టేషన్‌లో డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తూ రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన హోమ్‌గార్డు ఎస్.బాబా ఫక్రుద్దీన్ కుటుంబానికి రూ. 10 లక్షల ప్రమాద బీమా మొత్తాన్ని చెక్కు రూపంలో ఎస్‌పి అన్బురాజన్ గురువారం మృతుడి సమీమణి షేక్. షమీమ్ కు గురువారం అందచేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి హోమ్‌గార్డు కుటుంబ యోగ క్షేమాలు తెలుసుకున్నారు.

కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా చీకటి చార్లెస్



కడప : కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా చీకటి చార్లెస్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా చీకటి చార్లెస్ మాట్లాడుతూ తనకు ఈ పదవి వచ్చేందుకు కృషి చేసిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ తులసి రెడ్డికి, రాష్ట్ర ప్రధా న కార్యదర్శి రాజీవ్ రతన్‌కి, మాజీ అధ్యక్షులు నజీర్ అహ్మద్‌కి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు బండి జకరయ్యకి, సత్తార్‌కి, జిల్లా అధ్యక్షులు నీలి శ్రీనివా సరావుకు, ధ్రువకుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనను పార్టీ రాష్ట్ర సెక్రెటరీగా ఎన్నుకోవడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు.

కాల్వ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-పోరుమామిళ్ల


పట్టణంలో మురుగు నీటి వ్యవస్థను ప్రక్షాళన చేయడం కోసం రూ. 40 లక్షలతో రోడ్డుకు ఇరువైపులా మురుగునీటి కాలువలు నిర్మాణానికి గురువారం ఎమ్మెల్సీ డిసి గోవిందరెడ్డి శంకుస్థాపన చేశారు. దశలవారీగా పట్టణంలో వివిధ ప్రాంతాలలో నిర్మాణాలు చేపట్టి, పారిశుధ్యాన్ని మెరుగు పరుస్తామని చెప్పారు. కార్యక్రమంలో కరెంటు రమణారెడ్డి, రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ చిత్తా విజయ్ ప్రతాపరెడ్డి, రంగసముద్రం గ్రామపంచాయతీ సర్పంచ్ చిత్త రవి ప్రకాష్ రెడ్డి, ఎంపిడిఒ నూర్జహాన్, వైసిపి నాయకులు సి బాష, రవి, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, అధికారులు పాల్గొన్నారు.

గుర్తింపులేని పాఠశాలను మూసివేయాలి

ప్రజాశక్తి-బద్వేల్

పట్టణంలో ప్రభుత్వ గుర్తింపు లేకుండా తరగతులు నిర్వహిస్తున్న లిటిల్ ఫ్లవర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలను వెంటనే మూసివేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్ర ప్రసాద్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని డిమాండ్ చేశారు. గురువారం మధ్యాహ్నం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గోపవరం మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం ముందు విద్యార్థులతో కలిసి ఆందోళన నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ లిటిల్ ఫ్లవర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా విద్యార్థుల తల్లిదండ్రులకు తప్పుడు సమాచారం ఇస్తూ విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారని వారు అన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నా విద్యాశాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమని వాపోయారు. ఇప్పటికైనా మండల విద్యాశాఖ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారులు యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారి కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రామకృష్ణ, శ్రీను, వెంకటేష్, సుబ్బారాయుడు, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

కెఎస్ఆర్ఎంను సందర్శించి డైరెక్టర్



డాక్టర్ కృష్ణవేదులను సన్మానిస్తున్న సిబ్బంది

కడప అర్బన్ : నగర శివారులోని కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళా శాలలో ఐయు సిఇఇ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, డీన్ ఏమిరైటస్ డాక్టర్ కృష్ణ వేదుల, ప్రఖ్యాత మసా చూసెట్స్ విశ్వవిద్యాలయం (లోవెల్) అమెరికా, వారు కళాశా లను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు నిజమైన ఇంజినీరింగ్ విద్య సారాంశాన్ని వ్యాప్తి చేయడానికి తమ విద్యార్థి విభాగం అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోందని పేర్కొన్నారు. అనంతరం కళాశాల యాజ మాన్యం, వివిధ విభాగాల అధిపతులను, డీన్లు, సిబ్బంది విద్యార్థులతో ఇంటరాక్ట్ అయ్యారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ కందుల మదన్ మోహన్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ వి ఎస్ ఎస్ మూర్తి, కార్యక్రమం నిర్వాహకులు ఆర్. వి. శ్రీహరి, రాజేంద్ర కుమార్, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

సేంద్రియంపై మొగ్గు చూపాలి :ఎఒ



మాట్లాడుతున్న ఎఒ రామకృష్ణయ్య

అట్లూరు : ప్రస్తుతం భూతాపం పెరిగి వాతావరణం కలుషిత మవుతోందని, రైతులు రసాయ నిక ఎరువులు, పురుగుల మం దుల వాడకాన్ని తగ్గించి సేంద్రియంపై మొగ్గు చూపాలని ఎఒ రామకృష్ణయ్య పేర్కొన్నారు. గురువారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ సంచాలకులు నాగరాజు మాట్లాడుతూ సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ విధానాలు ప్రోత్సహించాలన్నారు. వివిధ పంటలలో సస్య రక్షణ కోసం కేవలం రసాయనిక పురుగు మందుల వాడకం మాత్రమే పరిష్కారం కాదని చెప్పారు. పురుగు మందుల విచక్షణా రహిత వాడకం అనేక అనర్థాలకు కారణమవుతోందని తెలిపారు. వరిలో కాలిబాటలు, నారుకొనలు తుంచి నాటడం, గట్లమీద చెట్ల పెంపకం, సకాలంలో కలుపు నివారించడం వంటి వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

మైనార్టీలకు చేసింది శూన్యం



మాట్లాడుతున్న అమీర్‌బాబు

కడప అర్బన్ :వైసిపి ప్రభుత్వం మైనార్టీలకు చేసింది శూన్యమని టిడిపి కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జి అమీర్ బాబు పేర్కొన్నారు. గురువారం తన స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనారిటీల సంక్షేమంపై ప్రస్తుత ప్రభుత్వం గడిచిన మూడున్నర ఏళ్లల్లో దాదాపు రూ.20వేల కోట్లు ఖర్చు చేసినట్లు ప్రటించడం శోచనీయమన్నారు. అసత్య ప్రచారాలు మానుకోవాలని లేకపోతే మైనార్టీలు తగిన సమయంలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో నగర ప్రధాన కార్యదర్శి జయకుమార్, నాయకులు నాసర్ అలీ పాల్గొన్నారు.

చట్టాలపై మహిళలకు అవగాహన

కడప : చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి కవిత అన్నారు. బాల్యవివాహాలు చట్టరితే నేరమని చెప్పారు. గురువారం జడ్జి కడప నగరంలోని ఉక్కాయపల్లిలోని స్వధార్ హోమ్‌ను సందర్శించారు. అక్కడ ఉన్నవారికి వివాహ చట్టాలు, డైవర్స్, బాల్య వివాహాలు, హ్యూమన్ ట్రాఫికింగ్ అనే అంశాలపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో హోమ్ నిర్వాహకులు, ప్రజలు పాల్గొన్నారు.


కృషి, తపన ఉన్నత మార్గాలకు సోపానాలు



మాట్లాడుతున్న ఎస్ఎస్ఎ పిఒ

కడపఅర్బన్ : కసి, కృషి ఉన్నత మార్గాలకు సోపానాలని విభిన్న ప్రతి భావంతుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణ కిశోర్, సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. సుమారు 700 మంది విద్యార్థులు, వారి తల్లి దండ్రులు టీచర్లు, పిఇటిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులకు మనోధైర్యం, ఉల్లాసం కల్గించి వారి భవిష్యత్‌కు బంగారు బాట వేసేందుకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎస్ఎస్ఎ పిఒ మట్లాడుతూ విద్యార్తుల్లో దాగి ఉన్న సామర్థ్యాలను వెలికి తీసేందుకు మరింత ప్రోత్సహించడానికి పోటీలు నిర్వస్తున్నామనారు. డిసెంబర్ 3న ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించి వందమంది మెరిట్ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఐఇడి కో-ఆర్డినేటర్ మిట్ట కేశవరెడ్డి, స్వచ్ఛంద సంస్థలు హెలెన్ కెలర్ దౌలత్ ఖాన్, ఆలీసిఫా స్పెషల్ స్కూల్ రఫీ పాల్గొన్నారు.

జాతీయ అధ్యక్షుడిని కలిసిన షరీఫ్ ఖాన్



రాజ్‌పాల్‌యాదవ్‌ను సన్మానిస్తున్న షరీఫ్‌ఖాన్

కడప అర్బన్ :ఇన్ కమ్ ట్యాక్స్ అప్పీలేట్ ట్రిబ్యునల్ జాతీయ అధ్యక్షులు జి.ఎస్. పన్ను, వైస్ ప్రెసిడెంట్ రాజ్ పాల్ యాదవ్‌ను గురువారం తిరుపతిలోని హోటల్ ఫార్చ్యూన్ రిడ్జ్ సమావేశంలో ఎపిటిపిసిఎ రాష్ట్ర అధ్యక్షులు పఠాన్. షరీఫ్ ఖాన్ కలిశారు. వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా షరీఫ్ ఖాన్ మాట్లాడుతూ అప్పిలేట్ ట్రిబ్యునల్ హైదరాబాద్ శాఖలో ఉన్న శాఖను తిరుపతిలో ఏర్పాటు చేయాలని చాలా కాలంగా కోరుతూ వస్తున్నామన్నారు. అప్పీలేట్ ట్రిబ్యునల్ హైదరాబాద్ శాఖ క్యాంప్ ఆఫీసును తిరుపతిలో ప్రారంభించడం సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఇన్ కమ్ ట్యాక్స్ కమిషనర్లు, అడిషనల్ కమిషనర్లు, సిఎలు, ఎపిటిపిసిఎ రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్ర మౌళి, తిరుపతి పట్టణ అధ్యక్షులు పద్మనాభం, నాగభూషణం, అన్నమయ్య జిల్లా ఈ సి మెంబర్ మోపురి వెంకట సుబ్బయ్య, కార్యవర్గ సభ్యులు ఇనుకోలు శివ పాల్గొన్నారు.

కడప మార్కెట్ యార్డ్ చైర్మన్‌కు శుభాకాంక్షలు

కడప అర్బన్ :కడప మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా ఎన్నికైన గంగాదేవిని, భర్త వైసిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షులు బంగారు నాగయ్య యాదవ్‌ను ఎంఎల్‌సి రమేష్‌యాదవ్ శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో అఖిల భారతీయ యాదవ సభ జిల్లా అధ్యక్షులు కొప్పల శివ యాదవ్, ఉపాధ్యక్షులు బిల్లా రమణ యాదవ్ శేఖర్ యాదవ్ పాల్గొన్నారు.

తెలుగు సాహిత్య విమర్శకు కొత్త ఒరవడి 'రారా'

ప్రజాశక్తి - కడప అర్బన్

తెలుగు సాహిత్య విమర్శకు కొత్త ఒరవడి రా.రా. (రాచమల్లు రామచంద్రారెడ్డి) అని యోగివేమన విశ్వవిద్యాలయం వి సి మునగల సూర్యకళావతి అన్నారు. సాహిత్య అకాడమీ, యోగి వేమన విశ్వవిద్యాలయం, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంయుక్త నిర్వహణలో బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో గురువారం రాచమల్లు రామచంద్రారెడ్డి శతజయంతి సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన విసి మాట్లాడుతూ రారాగా ప్రసిద్ధుడైన రాచమల్లు రామచంద్రారెడ్డి బహుముఖప్రజ్ఞాశాలి అని పేర్కొన్నారు. ఆయన తెలుగు సాహిత్యానికి తన విమర్శతో, అనువాదాలతో, పాత్రికేయ రచనలతో ఎంతో దోహదం చేశారన్నారు. సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ కేంద్ర సాహిత్య అకాడమీ 24 భాషల్లో పలు సాహిత్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నదన్నారు. గౌరవ అతిథి, సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ విమర్శకునికి మేధతోపాటు, స్పందించే హృదయం ఉండాలని రారా పేర్కొన్నట్లు తెలిపారు. అనంతరం 'మార్క్సిస్టు విమర్శకుడా రారా' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముగింపు సమావేశానికి యోగి వేమన విశ్వవిద్యాలయం కులసచివులు ఆచార్య దుర్భాక విజయ రాఘవ ప్రసాద్ అధ్యక్షత వహించి మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ సంజీవమ్మ, యోగి వేమన విశ్వవిద్యాలయ తెలుగు శాఖాధిపతి డాక్టర్ ఎన్.ఈశ్వరరెడ్డి, అధ్యాపకులు డాక్టర్ పార్వతి, తెలుగు, జర్నలిజం శాఖల విద్యార్థులు, అధ్యాపకులు, కమలాపురం సి.ఎస్. ఎస్.ఆర్ అండ్ ఎస్.ఆర్.ఆర్.ఎం. డిగ్రీకళాశాల విద్యార్థులు, పలు కళాశాలల అధ్యాపకులు, పలువురు సాహితీవేత్తలు, పరిశోధన కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

ప్రజాశక్తి ఒంటిమిట్ట

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటిం చాలని నూతనంగా బాధ్యతలు చేపట్టాన ఎస్ఐ మధుసూదన్‌రావు పేర్కొన్నారు. గురువారం బస్టాండ్, కోదండరామ ఆలయం సర్కిల్‌లో ఉన్న దుకాణ దారులతో సమావేశం నిర్వహించారు. అందరూ ట్రాఫిక్ అంతరాయం కల్గకుండా వ్యాపారాలు చేసుకోవాలన్నారు. ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలు దుకాణాల ముందు నిలబెట్టరాదని హెచ్చరించారు. జాతీయ రహదారికి ఇరువైపులా దుకాణాలు ఉన్నందున అక్కడ పార్కింగ్ చేసే వాహనాల వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. నిత్యం కోదండ రామాలయానికి యాత్రికులు వస్తుంటారని, రోడ్డుపై వాహనాలు ఎక్కడ పడితే అక్కడ నిలపకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

రుద్రరాజు నియామకాన్ని స్వాగతిస్తున్నాం

కడప : ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షులుగా గిడుగు రుద్రరాజును అధిష్టానం నియమించడాన్ని స్వాగతిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు అన్నారు. సౌమ్యుడు, మృదుస్వభావి, విషయ పరిజ్ఞానం కలిగిన వాడు, పార్టీని అధికారంలోకి తీసుకురావాలి అన్న తృష్ణ కలవాడు, అందర్నీ కలుపుకొని పోయే మనస్తత్వం గల వ్యక్తి గిడుగు రుద్రరాజు అని కొనియాడారు.

తక్షణ చర్యలు తీసుకుంటాం

ప్రజాశక్తి - కడప

జిల్లాలోని విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్. మునిశంకరయ్య తెలిపారు. గురువారం స్థానిక విద్యుత్ భవన్ నుంచి 'డయల్ యువర్ విద్యుత్ ఎస్ఇ' నిర్వహించారు. ఈ సందర్భంగా ముని శంకరయ్య మాట్లాడుతూ కడప, కాజీపేట, చక్రాయపేట, గోపవరం, భీ.మటం, విఎన్ పల్లి పల్లి ప్రాంతాల నుండి విద్యుత్ విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను తెలియజేశారని అన్నారు. సమస్యలన్నింటినీ తమ సిబ్బంది పరిశీలించిన అనంతరం తక్షణం పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పి. సుబ్రహ్మణ్యం జి. వి. సుబ్బారావు, జూనియర్ ఇంజనీర్ జి. లావణ్య పాల్గొన్నారు.

క్షయ రోగులకు ఉచితంగా మందులు

- వైద్యులు మల్లేశ్వరమ్మ

ప్రజాశక్తి - వేంపల్లె

క్షయ వ్యాధి నివారణకు ప్రభుత్వాసుపత్రిలో ఉచితంగా మందులు ఇస్తున్నట్లు డాక్టర్ మల్లేశ్వరమ్మ తెలిపారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో గురువారం ప్రధాన మంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. క్షయ వ్యాధి నిర్మూలనకు అందరూ కృషి చేయాలని కోరారు. గల్ల పరీక్ష ద్వారా క్షయ వ్యాధిని నిర్ధారించవచ్చన్నారు. పరిశుభ్రత ప్రతి ఒక్కరికీ అవసరమన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు సోకే పరిస్థితి ఉండదని వివరించారు. క్షయ వ్యాధి ఉన్న వారు పౌష్టికాహారాన్ని తప్పకుండా తీసుకోవాలని కోరారు. దాతల సహకారంతో పౌష్టికాహారాన్ని ఇవ్వడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీనివాసరెడ్డి, వైద్యనాథ్, హెడ్ నర్సు జ్యోతి నాగమణి, సూపర్‌వైజర్లు లక్ష్మితేజా, కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ శశికళ, విజయదాస్ పాల్గొన్నారు.


పౌష్టికాహారాన్ని అందిస్తున్న వైద్యులు మల్లేశ్వరమ్మ

మొర్రాయిపల్లె రోడ్డుకు నిధులు మంజూరు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని ఆనందాశ్రమం రోడ్డు నుంచి మొర్రాయిపల్లెకు వెళ్లే రోడ్డుకు అసంపూర్తి పనుల నిమిత్తం రూ.25 లక్షలు మంజూరైనట్లు ఆర్అండ్‌బి ఎఇ దాదాపీర్ పేర్కొన్నారు. గత ఏడాది చేపట్టిన ఈ రోడ్డు పనులు అసంపూర్తిగా నిలిచి పోయాయని తెలిపారు. ఆనందాశ్రమం, సిద్దారెడ్డి పల్లె వద్ద కొంతమేరకు రోడ్డు పనులు నిలిచి పోయాయని తెలిపారు. ఆ పనులను త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. అలాగే ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మరో నాలుగు రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ఆ పనులను కూడా త్వరలో చేపట్టనున్నట్లు ఎఇ వివరించారు.


మొర్రాయిపల్లె రోడ్డు

నేడు ఖాదరపల్లిలో 'బాదుడే బాదుడు'

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని ఖాదర్‌పల్లి గ్రామంలో మైదుకూరు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం బాదుడే బాదుడు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షులు అన్నవరం సుధాకర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఖాదర్‌పల్లి గ్రామస్తులు తమ సమస్యలను నాయకుల దృష్టికి తేవాలన్నారు.

సహాయ సూపర్‌వైజర్‌గా వరలక్ష్మి

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని కేతవరం అంగన్వాడీ కార్యకర్త వరలక్ష్మిని గ్రేడ్-2 సూపర్‌వైజర్‌కు సహాయ సూపర్‌వైజర్‌గా ఎంపిక చేసినట్లు సిడిపిఒ అరుణకుమారి తెలిపారు. గ్రేడ్-2 సూపర్‌వైజర్ల నియామకానికి ప్రభుత్వం గతంలో చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల ఆ నియామకాలు ఆగిపోయాయి. ప్రస్తుతం తాత్కాలికంగా సహాయ సూపర్‌వైజర్లను నియమించారని ఆమె తెలిపారు. విధులపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తలు వరలక్ష్మికి సహకరించాలని సిడిపిఒ కోరారు.



చెన్నకేశవులు మృతి ఉద్యమానికి తీరనిలోటు

- కామనూరు శ్రీనువాసులురెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

విద్యుత్ ఉద్యోగి ఎం.చెన్నకేశవులు మృతి విద్యుత్ ఉద్యమానికి తీరనిలోటని సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనూరు శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. చెన్నకేశవులు గుండె పోటుతో మతి చెందడంతో గురువారం ఆయన మృతదేహానికి శ్రీని వాసులరెడ్డి నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల ధర్నాలో పాల్గొనేందుకు ఢిల్లీకి వెళుతున్న పొద్దుటూరు ఇఆర్‌డి సీనియర్ అసెస్టింట్ ఎం.చెన్నకేశవులు మార్గమధ్యలోనే గుండెపోటుతో మరణించారన్నారు. రాజస్థాన్‌లోని బయన రైల్వే స్టేషన్‌లో మృతదేహన్ని దించారు. అక్కడ నుంచి ఇక్కడికి తరలించేందుకు సిఐటియు నాయకులు ఏర్పాట్లు చేశాంన్నారు. తక్షణం మృతుడి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, ఇద్దరి కుమారులకు ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు సత్యనారాయణ, బి విజయ్‌కుమార్, డి ఓబులేసు, లక్ష్మయ్య పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న సిఐటియు నాయకులు

అసైన్‌మెంట్ కమిటీలో దళితులకు చోటేది?



నిరసన వ్యక్తం చేస్తున్న మాల మహానాడు నాయకులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రభుత్వం నియమించిన అసైన్‌మెంట్ కమిటీలో దళితులకు, ప్రజా సంఘాలకు చోటేదని రాష్ట్ర మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు రామోజీ ఇమ్మానియేలు ప్రశ్నించారు. గురువారం స్థానిక మైదుకూరు రోడ్డులోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలు స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి అసైన్‌మెంట్ కమిటీ జరుగుతోందన్నారు. ప్రజా ప్రతినిధులు మాత్రమే కమిటీలో ఉన్నారని, ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ ప్రజా ప్రతినిధి తన అనుచరులకు, దళితులను బినామీలుగా చేసుకుని రాష్ట్రంలో లక్షలాది ఎకరాలు ప్రభుత్వ భూమి కాజేశారని ఆరోపించారు. దళితులకు పంచిన డికెటి భూములు ఎవరి అధీనంలో ఉన్నాయో అంతుచిక్కడంలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అసైన్‌మెంట్ కమిటీలో దళిత నాయకులకు చోటు కల్పించాలన్నారు. ప్రభుత్వం దళితుల సమస్యలను వినాలని రాష్ట్ర మాల మహానాడు తరపున కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో స్టేట్ జనరల్ సెక్రెటరీ వినోద్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటరమణ, రాష్ట్ర సమన్వయ కర్త చిన్న ఓబన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ యేసు రత్నం, ప్రసాద, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆటో ఢీకొని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

నగర పంచాయితీ పరిధిలోని కడప రోడ్డు క్రాంతి నగర్‌లో గురువారం ద్విచక్ర వాహనంలో వెళుతున్న సుబ్బారెడ్డి అనే వ్యక్తిని ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో సుబ్బారెడ్డి కుడికాలుకు తీవ్ర గాయమైంది. సంఘటనాస్థలానికి పోలీసులు చేరుకుని 108వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రాంతంలో చాలాసార్లు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, స్పీడ్ బ్రేకర్లు వేయాలని అధికారులను పలుమార్లు కోరినా ప్రయోజనం లేదని స్థానికులు పేర్కొంటున్నారు.

ఎసి బస్సు సర్వీసులు ప్రారంభం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల నుంచి హైదరాబాదు, విజయవాడకు ఓల్వా, డాల్ఫిన్ ఎసి బస్సుల సర్వీస్‌లు గురువారం నుంచి అందుబాటులోకి రావడం హర్షణీయమని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని అంబకపల్లి, కడప రోడ్డు సర్కిల్‌లో గురువారం మధ్యాహ్నం ఆర్‌టిసి అర్ ఎం గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా నడవనున్న వోల్వా, డాల్ఫిన్ ఎసి బస్సులను ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల నుంచి ఎసి సర్వీసులు నడిపేందుకు అనుమతి కోరిన వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండు బస్సులను మంజూరు చేయడం పట్ల ఈ ప్రాంత ప్రజల తరపున ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. మొదటగా గురువారం నుంచి హైదరాబాదుకు సర్వీస్ ప్రారంభమవుతుందన్నారు. వారం తర్వాత విజయవాడకు సర్వీస్ ప్రారంభమవుతుందన్నారు. పులివెందుల నుంచి ఈ బస్సులను నడిపేందుకు 12 మంది శిక్షణ పొందారని తెలిపారు. త్వరలో సుదూర ప్రాంతాలకు వెళ్లేందుకు మరిన్ని సర్వీసులు పెంచేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పులివెందుల డిపో మేనేజర్ ఉమామహేశ్వర్‌రెడ్డి, డిపో సూపరింటెండెంట్ కుళ్లాయప్ప, పాడా ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ హాల్ గంగాధర్‌రెడ్డి, తుమ్మలపల్లి జడ్‌పిటిసి మహేశ్వర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, కౌన్సిలర్లు పార్నపల్లి కిషోర్, ఖాదర్, నాయకులు సిద్దయ్య, అంబకపల్లె బాబురెడ్డి, వైసిపి విద్యార్థి విభాగం పట్టణాధ్యక్షుడు పోరెడ్డి జస్వంత్ రెడ్డి, డిఎస్‌పి శ్రీనివాసులు, సిఐ రాజు, ఆర్‌టిసి అధికారులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.


ఎసి బస్సును ప్రారంభిస్తున్న ఎంపీ, అధికారులు

కొనసాగుతున్న ఆర్‌టిపిపి కార్మికుల నిరసన


ప్రాజెక్ట్ మెయిన్ గేట్ వద్ద నినాదాలు చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు


పోరాటానికి ఎమ్మెల్యే మద్దతు కోరుతున్న జెఎసి నాయకులు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండలంలోని రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌లో కాంట్రాక్ట్ కార్మికులు చేస్తున్న నిరసనలు గురువారానికి మూడో రోజుకు చేరుకున్నాయి. ప్రాజెక్టు మెయిన్ గేట్ వద్ద పెద్ద సంఖ్యలో కాంట్రాక్ట్ కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు నినాదాలు చేశారు. ప్రతిపక్షంలో ఉండగా జగన్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఆర్‌టిపిపిలోని 600 ఎంవి గేట్ వద్ద భూ నిర్వాసితులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు కూడా మూడవ రోజుకు చేరుకున్నాయి. గురువారం దీక్షలో మహేశ్వరి, లక్ష్మీదేవి, శివ మల్లేశ్వరి, రాజేష్, రమణయ్య కూర్చున్నారు.

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిసిన జెఎసి నాయకులు

ఆర్‌టిపిలో గత కొద్దిరోజులుగా జరుగుతున్న ధర్నాను నిర్వహిస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు గురువారం ఉదయం జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిశారు. తాము నిర్వహిస్తున్న పోరాటానికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యే ద్వారా ముఖ్యమంత్రికి, విద్యుత్‌శాఖ మంత్రికి సమస్యను తెలియజేయాలని జెఎసి నాయకులు కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు చేసే పోరాటానికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారని నాయకులు తెలిపారు.

ముద్దనూరు-ఆర్‌టిపిపి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు నుంచి కొసినెపల్లె గ్రామం మీదుగా ఆర్‌టిపిపి వరకు రోడ్డు నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టిడిపి హయాంలో పాలకుల నిర్లక్ష్యంతో ఆరేళ్లుగా ముద్దనూరు నుండి ఆర్‌టిపిపికి వెళ్లేందుకు రోడ్డు లేక ప్రజలు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడేవారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రజలకు అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు పాటుపడుతున్నామన్నారు. ఎపి ఆర్ఆర్ పిఇఎపి నిధుల ద్వారా మంజూరైన రూ.4.20 కోట్లతో 6.5కిలో మీటర్లు రోడ్డు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రదీప్‌కుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, వైసిపి నాయకులు డాక్టర్ నవజ్యోత్‌రెడ్డి, నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు గుర్రప్ప, రమణారెడ్డి, తిరుమలరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, డిఇ వెంకటేష్, జెఇ రవి, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.


రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

అనుబంధ ఫారాలు మంజూరు చేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

గృహనిర్మాణ లబ్ధిదారులకు రెవెన్యూ అధికారులు అనుబంధ ఫారాలు మంజూరు చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి ఆదేశించారు. మండలంలోని గూడెంచెరువు గ్రామంలో గురువారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 90 రోజుల వ్యవధిలో లబ్ధిదారులకు ఇంటి స్థలాలను చూపించాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందన్నారు. నిరుపేదలకు ఇంటి స్థలాల పట్టాలిచ్చి ఏడాది అవుతున్నప్పటికీ రెవెన్యూ అధికారులు స్థలాలను లబ్ధిదారులకు ఇవ్వకపోవడం చాలా విచారకరమన్నారు. గడపగడపకు మన ప్రభుత్వంలో ప్రజల నుండి ఇంటి స్థలాలపై, అనుబంధ ఫారాలపై ఎక్కువగా ఫిర్యాదులు అందుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇళ్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్యే తెలిపారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదో అని తెలుసుకునేందుకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా సచివాలయ ఉద్యోగులు చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రజల నుండి విద్యుత్, రోడ్లు, కాలువలు మంజూ రయ్యేలా చూడాలని విన్నపాలు ఎమ్మెల్యే దృష్టికి వచ్చాయి. కార్యక్రమంలో సర్పంచు నాగేశ్వరి, ఎంపిటిసి పి.లక్ష్మీదేవి, వైసిపి నాయకులు పి. నాగేశ్వర్‌రెడ్డి, పి.రాయుడు, సంజీవరాయుడు, హనుమంత్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు , ప్రజలు పాల్గొన్నారు.

సెల్ టవర్ వద్దంటూ కమిషనర్‌కు వినతి


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్, ఎయిర్‌టెల్ మేనేజర్

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

నగర పంచాయితీ పరిధిలోని 12వ వార్డు శాంతినగర్‌లో ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ సెల్ టవర్ వద్దంటూ ఆ ప్రాంతవాసులు కోరారు. ఆ మేరకు వైసిపి నాయకుడు యూసుఫ్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ తమ ప్రాంతంలో సెల్ టవర్ నిర్మిస్తే రేడియేషన్ ప్రభావంతో చర్మ సంబంధ వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. చిన్న పిల్లలకు, గర్భిణులకు ఎక్కువ ప్రమాదం ఉంటుందని వివరించారు. కాదని నిర్మిస్తే వచ్చే రోగాలకు మీరే వైద్యం చేయించాలని, అలాగని అగ్రిమెంటు రూపంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎయిర్‌టెల్ ఏరియా మేనేజర్ హేమంత్‌ను వివరణ కోరగా.. శాంతినగర్ వాసులు అపోహ పడుతున్నారని, అది సెల్‌టవర్ కాదన్నారు. ఇంటర్‌నెట్ స్పీడుకు సంబంధించి బూస్టర్‌ను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. మున్సిపల్ కమిషనర్ తన కార్యాలయంలో శాంతినగర్ ప్రాంతవాసులతో ఏర్పాటు చేసిన సమావేశం ఏర్పాటు చేవారు. సమస్యను ఉన్నతాధికారులకు వివరిస్తామని కమిషనర్ జగన్నాథ్ పేర్కొన్నారు.

భోజనం తినలేక.. విద్యార్థులు ఆశ్రమం బాట

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం మధ్యాహ్నం భోజనం తినలేక విద్యార్థులు ఆశ్రమ బాట పట్టారు. మధ్యాహ్న భోజన పథకంలో నూతన మెనూలో భాగంగా గురువారం సాంబార్ బాత్ విద్యార్థులకు వడ్డించగా.. విద్యార్థులు ఈ వంటను తినలేమన్నారు. 292 మంది విద్యార్థులు హాజరుకాగా వారిలో స్థానికంగా ఉన్న కొంతమంది భోజనానికి ఇళ్లకు వెళ్లారు. వసతి గృహ విద్యార్థులు దాదాపు నాలుగు కిలోమీటర్లు ఉన్న అచలానంద ఆశ్రమానికి వెళ్లి భోంచేశారు. మళ్లీ పాఠశాలకు చేరుకున్నారు. దీనిపై ప్రధానోపాధ్యాయురాలు విజయకుమారిని వివరణ కోరగా.. నూతన మెనూ విద్యార్థులకు రుచించలేదన్నారు. దీంతో విద్యార్థులు చెప్పాపెట్టకుండా బయటకి వెళ్లి ఉంటారని పేర్కొన్నారు.


ఆశ్రమానికి వెళుతున్న విద్యార్థులు

నాడు-నేడు పనులు త్వరగా పూర్తిచేయాలి

- విద్యా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్

ప్రజాశక్తి - రాయచోటి

రెండో దశ మనబడి నాడు-నేడు పనులు త్వరగా పూర్తి చేయాలని పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడలోని సమగ్ర శిక్షా కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా విద్యాశాఖ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులతో రెండవ దశ మనబడి "నాడు-నేడు" పనుల పురోగతి పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ గిరీష పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను ప్రస్తుతం ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేర్చే లక్ష్యంతో రెండో విడత మనబడి నాడు-నేడు పనులు చేపడుతున్నామని చెప్పారు. నాణ్యతతో నిర్దేశించి చేసిన పనులకు సంబంధించి ఎప్పటికప్పుడూ ఖర్చులు ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా ఇంజినీరింగ్ అధికారులకు మార్గదర్శకాలు జారీ చేయాలని సూచించారు. నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడొద్దన్నారు. ప్రతి పాఠశాలలో గణనీయంగా మార్పులు కనిపించాలని చెప్పారు. ఈ దిశగా అధికారులు బాధ్యతతో పని చేయాలని స్పష్టం చేశారు.

నాడు-నేడు సబ్ ప్రాజెక్ట్ అన్నీ కూడా వందశాతం గ్రౌండ్ కావాలన్నారు. జగనన్న విద్యా కానుక సంబంధించి బయోమెట్రిక్ పెండింగ్ లేకుండా క్లియర్ చేయాలన్నారు. బడి బయట ఉన్న పిల్లలపైన ప్రత్యేక దృష్టి పెట్టి పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మనబడి నాడు-నేడు పనులు నిర్దేశించిన గడువు లోపు పూర్తి చేయాలన్నారు. పనుల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలు లోపిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డిఇఒ రాఘవరెడ్డి, సమగ్ర శిక్ష సిఎంఇఒలు కరుణాకర్, చంద్రశేఖర్ నాయక్ పాల్గొన్నారు

కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం

ప్రజాశక్తి - కడప

రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా ఎన్నికైన గిడుగు రుద్రరాజు నేతృత్వంలో రాబోవు రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసి ముందుకు తీసుకెళ్తామని కడప జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షునిగా పోటీ చేస్తున్న వెన్నపూస మధురెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. గిడుగు రుద్రరాజు సారథ్యంలో రాష్ట్రంలో 2024లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. గిడుగు రుద్రరాజుకు అన్ని విధాలా యూత్ కాంగ్రెస్ తరుపున సహకరిస్తామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ రాష్ట్ర కమిటీ నూతన అధ్యక్షులుగా గిడుగు రుద్రరాజును అధిష్టానం నియమించడాన్ని యూత్ కాంగ్రెస్ తరపున స్వాగతిస్తున్నామని తెలిపారు. కడప జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా పోటీ చేస్తున్న తన గెలుపునకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ నాయకులను, కార్యకర్తలను మధురెడ్డి కోరారు.


వెన్నపూస మధురెడ్డి

నేడు చియ్యపాడులో ఆధార్ సేవలు

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని చియ్యపాడు గ్రామ పంచాయతీ సచివాలయం పరిధిలో శుక్రవారం ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయని ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ చియ్యపాడు సచివాలయంలో బుధవారం నుంచి ఆధార్ క్యాంప్ నిర్వహిస్తున్నామన్నారు. శుక్రవారంతో ఈ క్యాంపు పూర్తి అవుతుందన్నారు. ఇప్పటికీ ఆధార్ అప్డేషన్ చేయించుకోని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

జౌకు నీళ్లతో పంటలకు నష్టం

ప్రజాశక్తి - లింగాల

లింగాల కుడి కాలువ నుంచి వస్తున్న జౌకు నీళ్లతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని రైతులు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. మండల పరిధిలోని వెలిదండ్ల గ్రామంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎంపీ నిర్వహించారు ఈ సందర్భంగా గ్రామంలో పలు సమస్యలు ఆయన దృష్టికి తెచ్చారు. రైతులు మాట్లాడుతూ జౌకు నీళ్ల వల్ల దాదాపు 200 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయన్నారు. ఇందుకు ఎంపీ స్పందిస్తూ జౌకు నీరు పొలాల్లోకి రాకుండా చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం బస్టాండ్ వద్ద రూ.18 లక్షల వ్యయంతో నిర్మించిన వాణిజ్య భవన సముదాయాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిపి అమృత, మాజీ ఎంపిపి సుబ్బారెడ్డి, మండల యూత్ కన్వీనర్ మనోహర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

దాడిని ఖండిస్తూ ఎంఆర్‌పిఎస్ నిరసన

ప్రజాశక్తి - ఖాజీపేట

ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు రుద్రపోగు సురేష్ మాదిగపై దాడిని ఖండిస్తూ గురువారం స్థానిక అంబేద్కర్ కూడలిలో ఆ సంఘం నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాడికి పాల్పడిన సిఐ హైమారావును వెంటనే శిక్షించాలన్నారు. ఆయనపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేవారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ మండల ఇన్‌ఛార్జి రమణ మాదిగ, ముత్తులూరుపాడు గ్రామ అధ్యక్షుడు గంగులయ్య, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, నాసానిపల్లె గ్రామ అధ్యక్షుడు లడ్డు, మురళి, మహేంద్ర, పాటిమీదపల్లె అధ్యక్షుడు భాస్కర్, బోసిరెడ్డిపల్లి అధ్యక్షుడు దినేష్, నాయకులు లక్షుమయ్య, రాజామాదిగ, నాగేష్, మహేష్, ఓబులేసు, శ్రీను, ఓబులేసు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డికి సన్మానం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారులుగా నియమితులైన ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డిని గురువారం గ్రామ వ్యవసాయల సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షుడు హరీంద్ర ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా హరీంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న గ్రామ వ్యవసాయ సహాయకుల సమస్యలను పరిష్కరించేలా కృషి చేయాలని తిరుపాల్ రెడ్డిని కోరారు. కార్య క్రమంలో అసోసియేట్ ప్రెసిడెంట్ గోపిరామ్, జనరల్ సెక్రెటరీ బ్రహ్మానందరెడ్డి, స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ రామ్‌చరణ్, యూనియన్ సభ్యులు వినయ్ పాల్గొన్నారు.


తిరుపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న హరీంద్ర, నాయకులు

నూతన మార్కెట్ యార్డ్ స్థల పరిశీలన

ప్రజాశక్తి - మైదుకూరు

కూరగాయలు పండించే రైతులు తమ ఉత్పత్తులను అమ్ముకునేందుకు మార్కెట్ యార్డ్‌లో దుకాణాల ఏర్పాటుకు గురువారం ఎమ్మెల్యే ఎస్. రఘురామిరెడ్డి స్థలాన్ని పరిశీలించారు. ఆ మేరకు మార్కెట్ యార్డులో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పలుచోట్ల రోడ్ల మీద కూరగాయలమ్ముకుంటున్న వారంతా డిసెంబర్ 3నాటికి మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నూతన కూరగాయల మార్కెట్‌కు చేరుకోవాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే మండలంలో నూతనంగా నిర్మిస్తున్న పశువుల సంత మార్కెట్ యార్డ్ ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి సంబంధిత అధికారులతో చర్చించారు. వ్యవ సాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అన్నపురెడ్డి శ్రీమన్నారాయణరెడ్డి. మైదుకూరు మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మార్కెట్ యార్డ్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

రక్తదాన శిబిరానికి స్పందన

ప్రజాశక్తి - చక్రాయపేట

రక్తదానం చేయడం సంతోషకరంగా ఉందని భూమిరెడ్డి వెంకట లక్ష్మిరెడ్డి పేర్కొన్నారు. గురువారం చక్రాయపేట గ్రామంలో ఎస్ఆర్‌కె కన్‌స్ట్రక్షన్స్ అధినేత శెట్టిపల్లె రవికుమార్‌రెడ్డి పెద్ద కర్మ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని భూమిరెడ్డి వెంకట లక్ష్మిరెడ్డి, హేమంత్ కుమార్‌రెడ్డి సహకారంతో కడపకు చెందిన భోగా పార్వతమ్మ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ ఎం.వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. చక్రాయపేటలోని ఎస్ఆర్‌కె కన్‌స్ట్రక్షన్స్‌కు చెందిన దాదాపు 30 మంది ఉద్యోగులు, కార్మికులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఇతరుల ప్రాణాలను కాపాడవచ్చన్నారు. ఉద్యోగులు పలువురికి ఆదర్శంగా నిలవడం అభినందనీయమని పేర్కొన్నారు.



రక్తదానం చేస్తున్న ఉద్యోగులు